
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కాచిగూడ డివిజన్‌కు చెందిన 25 మందికి కల్యాణలక్ష్మి, ఆరుగురికి షాదీ ముబారక్ చెక్కులను తహసీల్దార్ డి.సంధ్యారాణి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. పథకాలను సద్వినియోగం చేసుకుని పేదలు అభివృద్ధి చెందాలని కోరారు. 31 మందికి ఒక్కొక్కరికి లక్షా నూటపదహారు రూపాయల చొప్పున 31 లక్షల రూపాయల చెక్కులను అందజేశామన్నారు.


సదర్ సమ్మేళన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ తదితరులు

ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చు

ముషీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యాదవులు ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో రామన్నపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న జరిగే సదర్ ఉత్సవాల బ్రోచర్‌ను ఎడ్ల హరిబాబు యాదవ్ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రామన్నపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సదర్ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన భారీ దున్నలు పాల్గొనేలా తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ భువనగిరి వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్య యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుర్గయ్య, మండల అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షులు జంగయ్య, విద్యావంతుల వేదిక మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.


సత్యనారాయణబాబును సన్మానిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

బీఆర్‌ఎస్ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలి

ముషీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు అంకిత భావంతో పనిచేయాలని ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ వినోభానగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సెల్ ఇన్‌చార్జి సత్యనారాయణబాబు పార్టీ కార్యక్రమాలు, ప్రజాసమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. సోషల్ మీడియాలో ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటి పరిష్కారానికి సత్యనారాయణబాబు ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ముషీ రాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, జావిద్ ఖాన్, బల్వంత్, మున్వర్‌చాంద్, భాస్కర్, ఎయిర్‌టెల్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు శివశంకర్ తదితరులు

ఘనంగా ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు జన్మదిన వేడుకలు

కవాడిగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బి.శివశంకర్ ఆధ్వర్యంలో కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు, నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ చేయడంతో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డి శ్రీనివాస్, టింకు. ముప్పిడి నర్సింగ్, గోరే, గోవింద్, మహేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బీఆర్‌ఎస్ నాయకుడు రాంపాల్ దేవ్‌డా ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుక్స్‌ను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నేత శ్రీను, శ్యాంసుందర్ చిట్టి, సయ్యద్ అస్లాం, నందు, ఇషాక్, వెంకటరామిరెడ్డి, రఘు, మాణిక్ ప్రభు, ప్రకాష్ దేవ్‌డా పాల్గొన్నారు. (రాంనగర్, ఆంధ్రజ్యోతి)



కాంగ్రెస్, బీజేపీ నేతల ప్రత్యేక పూజలు

అంబర్‌పేట బొడ్రాయి పునః ప్రతిష్ఠ ముగింపు వేడుకల సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రంగంపల్లి రాజు, కెంచె చంద్రశేఖర్, జెల్లి శ్రీమంత్‌గిరి, ఏడెల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

దేశం క్రీడల్లో వెనకబడటం శోచనీయం

- వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అధిక జనాభా ఉన్న భారతదేశం క్రీడల్లో వెనకబడి ఉండటం శోచనీయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 11 కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్సుగా బాల బాలికల విభాగంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నిలిచింది. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో బాలురు, బాలికల విభాగంలో అశ్వారావుపేటకు చెందిన కె.అనిల్ కుమార్, ఎం.రచన చాంపియన్‌లుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి ప్రొ.జానయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

- మోడ్రన్ గ్రంథాలయ భవనానికి రెండేళ్ల క్రితం శంకుస్థాపన
- అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తికాని పనులు
- లైబ్రరీకి నోచుకోని బండమైసమ్మ నగర్ బస్తీ వాసులు


కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో నత్తనడకన సాగుతున్న మోడ్రన్ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

నత్తనడకన పనులు..

నెరవేరని లక్ష్యం!

కవాడిగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠకులకు జ్ఞానాన్ని అందించే సరస్వతీ నిలయాలు గ్రంథాలయాలు.. బస్తీలు, కాలనీల్లోని ప్రజలు.. ముఖ్యంగా యువతకు వివిధ అంశాల్లో జ్ఞానం అందించే ఉద్దేశంతో బస్తీల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలకు చేపట్టిన నూతన భవనాల నిర్మాణం నత్తనడకన సాగుతుండంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడటం లేదు. ఇందుకు కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో నిర్మించ తలపెట్టిన మోడ్రన్ గ్రంథాలయ భవన నిర్మాణమే ఉదాహరణ. ఇక్కడ ఉన్న లైబ్రరీ పాత భవనాన్ని కూల్చివేసి, దాని స్థానంలో దాదాపు కోటి రూపాయల వ్యయంతో జీ ప్లస్ వన్ విధానంలో మోడ్రన్ గ్రంథాలయ భవనం నిర్మించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల క్రితం నాటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి శంకుస్థాపన చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగడంతో నేటికీ పూర్తి కాలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంటడంతో అసాంఘి శక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి పూట తాగుబోతులు ఇక్కడ మద్యం తాగుతూ నానా రభస చేస్తున్నారని వాపోతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే బండమైసమ్మనగర్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులకు, గ్రంథాలయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రంథాలయ శాఖ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన బండమైసమ్మనగర్‌లో మోడ్రన్ గ్రంథాలయ భవనాన్ని పూర్తి చేసి బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

గ్రంథాలయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో చేపట్టిన మోడ్రన్ గ్రంథాలయ భవన నిర్మాణ పనుల్లో జాప్యం విషయాన్ని గ్రంథాలయ శాఖ, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. అధికారుల సమన్వయం లోపం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. రెండు శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన లైబ్రరీ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుచ్చేందుకు చర్యలు తీసుకుంటా.

\- ఎమ్మెల్యే ముఠాగోపాల్

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆలస్యం



బండమైసమ్మనగర్‌లో రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన గ్రంథాలయ భవన నిర్మాణం అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆలస్యమవుతోంది. అధికారుల సమన్వయ లోపంతోనే సమస్య ఏర్పడింది. బస్తీవాసులు ఈ విషయమై అనేక సార్లు నాకు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ, గ్రంథాలయ శాఖ అధికారులకు సమస్యను వివరించి త్వరగా భవన నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేస్తా.

-జి, రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి



బండమైసమ్మనగర్‌లో రెండేళ్ల క్రితం జీ ప్లస్ వన్ విధానంలో మోడ్రన్ గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు పూర్తి చేసిన మేరకు ఎప్పటికప్పుడు మాకు బిల్లులు పంపిస్తే వాటిని జీహెచ్‌ఎంసీకి పంపించి క్లియర్ చేయిస్తున్నాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నా వంతు చర్యలు తీసుకుంటా.

\- పద్మజ, నగర కేంద్ర గ్రంథాలయ సెక్రటరీ



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్‌గౌడ్, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు కాట్రగడ్డ ప్రసూన, సాయిబాబా తదితరులు

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

- పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్

రాంనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పటిష్ఠత కోసం కార్యకర్తలందరూ పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం సభ్యత్వ నమోదు 5 లక్షలకు పైగా చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. శుక్రవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, పార్టీ పటిష్ఠత కోసం కొన్ని కఠిన చర్యలు తప్పవని, క్రియాశీలకంగా వ్యవహరించని వారిని ఏ మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ క్షేత్ర స్థాయి బూత్‌ల వారీగా సభ్యత్వం చేయాలని సూచించారు. తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సామ భూపాల్‌రెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు పి.అశోక్, ఎంకే బోసు, శ్రీనివాస్‌నాయుడు, షకీలారెడ్డి, మీర్ అశ్వాక్ ఆలీ, యాదగిరిరావు, పరుశరామ్, రూప్సీ, శశిరేఖ, శ్యామ్‌సుందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి. నాగేశ్వరరావు తెలిపారు. మదర్ డయిరీ 11కేవీ ఫీడర్ పరిధిలోని రామ్‌నగర్ క్రాస్‌రోడ్, మదర్స్ హైస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎల్ఐసీ నగర్ పరిధిలోని వారాసిగూడ, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, మూనోకేఫ్ పరిధిలో శ్రీరామ్‌నగర్, అచ్యుయ్యనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5, టూరిస్ట్ హోటల్ పరిధిలోని బజాజ్ షోరూమ్, కాచిగూడ మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదన్నారు.

కార్తీకమాస ప్రత్యేకపూజలు

చిక్కడపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో గల శివాలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఏకవార రుద్రాభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోష పూజలు నిర్వహించారు. పూజలను ఆలయ ఈఓ దేవనాథం పర్యవేక్షించారు.

ఈట్‌రైట్ ఫుడ్ సర్వేను పరిగణనలోకి తీసుకోవాలి

చిక్కడపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈట్‌రైట్ ఫుడ్ సర్వే అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. శుక్రవారం సాయంత్రం గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం విషతుల్యమై వంద మంది విద్యార్థులు నారాయణపేట జిల్లాలో ఆస్పత్రి పాలైనా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. బుధవారం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు ఆస్పత్రి పాలైనా కూడా గురువారం సరఫరా చేసిన మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయని అన్నారు. ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతున్న విద్యార్థులకు ఇలాంటి ఆహారం పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ సంస్థ పక్షాన కూడా మధ్యాహ్న భోజనంతోపాటు ఆహార కల్తీలపై సర్వే చేస్తున్నామని, తమ సర్వేలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సాంబరాజు చక్రపాణి కోరారు. కార్యక్రమంలో దక్షిణాదిరాష్ట్రాల కోఆర్డినేటర్ పల్లెపాడు దామోదర్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టే వరకు దీక్ష ఆగదు


దీక్షను కొనసాగిస్తున్న పోకల కిరణ్ మాదిగ

బర్కత్‌పుర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై ఆర్టికల్ 341 సవరించి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. బర్కత్‌పురా లోని మహాకూటమి కార్యాలయంలో దండోరా ధర్మపోరాటం ఆమరణ నిరాహార దీక్ష రెండవ రోజు కొనసాగింది. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించేంత వరకు తమ దీక్ష కొనసాగుతుందన్నారు. పలు సంఘాల నేతలు కిరణ్ మాదిగకు సంఘీభావం తెలిపారు. గొల్లపల్లి దయానందరావు, కల్యాణ్ ప్రేమ్‌రాజ్, జంగన్నగౌడ్, కొప్పుల వినోద్‌కుమార్, నల్లా సూర్యప్రకాష్, రామన్న మాదిగ, సుధాకర్ మాదిగ, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నల్లకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలలంతా ఏకమై మరో ఉద్యమానికి నాంది పలకాలని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ఉంటే చూస్తూ ఊరుకోవద్దని, మన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ సత్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో మాలల బస్తీ బాట సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మాల జాతి చైతన్యం కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. సమాజంలో మాలలకు సరైన గౌరవం దక్కడం లేదన్నారు. మన హక్కుల కోసం సమష్టిగా పోరాడకపోతే భవిష్యత్ తరాలకు నష్టం చేసిన వారమవుతామన్నారు. మాలలపై ఇతర పార్టీలు, వర్గాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. మాలల ఆత్మగౌరవం కోసం డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పోరాటంలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలన్నారు. ఈ గర్జన మన దశ, దిశ మారుస్తుందని, ఇదే మనకు లాస్ట్‌చాన్స్ అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షలకు పైగా జనాభా కలిగిన మాల, మాల అనుబంధ కులాలకు పూర్తి వ్యతిరేకంగా ప్రధాని మోదీ ప్రభుత్వం పని చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి హైదరాబాద్ చైర్మన్ రాజు వస్తాద్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ పి.బల్వంత్‌రావు, కో-కన్వీనర్ తాలుకా రాజేష్, న్యాయవాది ఎస్.ఈ.మహేందర్, నాయకులు క్రాంతి, కర్మ భిక్షపతి, అశోక్, రవి, రాజేంద్ తదితరులు పాల్గొన్నారు.


సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మన్నె శ్రీధర్‌రావు, బల్వంత్‌రావు, రాజేష్ తదితరులు


నాగదేవత ఆలయం వద్ద అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావన తోపాటు ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి. శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నాగదేవత ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ నాగదేవత ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠాజైసింహ, ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ఎయిర్‌టెల్ రాజు, భాస్కర్, వంగాల నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌పాల్గొన్నారు.


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

హరినగర్‌లో అయ్యప్ప మహాపడి పూజ

రాంనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో అయ్యప్ప స్వామి మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, అయ్యప్ప స్వాములు, నాయకులు, ఎర్రోళ్ల సతీష్, శ్రీనివాస్, రాకేష్ స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.


బిజ్జి కనకేష్ కుమార్‌ను సన్మానిస్తున్న కన్వీనర్ రమేష్‌రాం తదితరులు

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

ముషీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మరింత బలోపేతానికి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్యభవన్‌లో నియోజకవర్గ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌రాం మాట్లాడుతూ... నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదును నిర్వహిస్తూ యువత, మహిళలు పార్టీకి మరింత చేరువయ్యేందుకు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదును విజయవంతంగా కొనసాగిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు, ఆర్ విశ్వం, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, నగర అధికార ప్రతినిధి బొల్లంపల్లి రాంరెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

అఫ్జల్‌గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో నమ్మించి మోసం చేసిన ఆర్‌జే సంస్థపై తగిన చర్యలు తీసుకుని, తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరుతూ బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులు ప్రముఖులతో ప్రకటనలు ఇప్పించడంతో నారాయణ్‌ఖేడ్, ఘట్‌కేసర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఫామ్‌ల్యాండ్‌లను కొన్నామన్నారు. సుమారు 600 మంది నుంచి రూ.150 కోట్లను నిర్వాహకులు వసూలు చేశారని ఆరోపించారు. 2020లో ఒక్కొక్కరం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కట్టామని, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. వెంచర్ ఎండీ భాస్కర్‌గుప్తా, డైరెక్టర్ సుధారాణిలను తాము ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారని, అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. ఈ విషయమై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని,ఆర్‌జే సంస్థ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని కోరారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గోపాల్

సుందరయ్య పార్కులో వైద్యశిబిరం ప్రారంభం

రాంనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహలతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వాకర్స్ సౌకర్యార్థం పార్కులో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, నాయకులు బబ్లు, పార్కు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వివేక్, నాయకులు నాగభూషణం, రమేష్‌రెడ్డి, శైలజ, వెంకటస్వామిగౌడ్, జనార్దన్, కూరగాయల శ్రీనివాస్, మహేష్‌బాబు, గోపి, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం సత్వరం పూర్తి చేయండి

రాంనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని జీహెచ్ ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, నరహరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధుల సమస్యను పరిష్కరించాలి

కవాడిగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రజాప్రతినిధుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటాలలో అందరం భాగస్వాములవుదామని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడలో ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. గతంలో ప్రజలకు సేవలందించిన మాజీ ప్రజాప్రతినిధులు నేడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మాజీ ప్రజాప్రతినిధులకు ఆరోగ్య బీమా, ఉచిత బస్సు సౌకర్యం, భూమి లేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇందిర్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వేదిక నాయకులు దేవయ్య, గోపాల్, యాదయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్ రహీం, మల్లికార్జున్‌గౌడ్, మల్లేశంగౌడ్, రాజు, మల్లారెడ్డి, ఉప్పలయ్యగౌడ్, అప్పారావు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.